క్లుప్తంగా

నేడు 2కే రన్

హుజూర్‌నగర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన

చిలుకూరు: మండలంలోని దూదియాతండా గ్రామంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో సోమవారం స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆలయ మఠాధిపతులు పమ్మి బ్రహ్మయాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పమ్మి పిచ్చయ్య చారి, పమ్మి ఉపేంద్ర చారి, నాగబ్రహ్మచారి విగ్రహాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శిగా వంశీ యాదవ్


నియామక పత్రం అందుకుంటున్న వంశీ

చిలుకూరు: బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శిగా చిలుకూరు మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన బాషం వంశీయాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నుంచి ఆయన నియామకప్రతం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలి శ్రీనివాస్ నాయుడు, సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వీరబోయిన లింగయ్య, సుధాకర్ గౌడ్, సీతారామ సింగ్, భిక్షం గౌడ్‌లకు వంశీయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షనర్ల సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన

మఠంపల్లి: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సహకారంతో చేపట్టిన పెన్షనర్ల నూతన భవన నిర్మాణానికి ఆదివారం స్థానిక సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్యలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు, సంఘం మండల అధ్యక్షులు యాదగిరి, కోటయ్య, సోమయ్య, శ్రీనివాసరావు, సీతారాంరెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, దేవదానం, స్థానిక సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరి గుట్ట స్థలాల పరిశీలన


లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ శివారులోని ఫణిగిరి గుట్ట వద్ద ప్రభుత్వ లేఅవుట్‌ను ఇన్‌చార్జ్ ఆర్డీఓ కిశోర్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న స్థలాలను, నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ జయశ్రీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గిరిజన బంధు ప్రకటించాలి

మఠంపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లోనే గిరిజన బంధు ప్రకటించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం ఆయన మఠంపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గిరిజన బంధును వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 16న రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు వినోద్ నాయక్, శంభయ్యనాయక్, వాలీబాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్: సీఎం కేసీఆర్ పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని వివిధ వార్డుల్లో లబ్ధిదారులకు మంజూరైన రూ.2.65 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సౌజన్య ధనుంజయ్, మంగమ్మ వీరారెడ్డి, మాజీ కౌన్సిలర్ కిరణ్ కుమార్, వార్డు అధ్యక్షుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న కంపచెట్లు

- చిలుకూరులో రోడ్డు మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లు
- రెండు నెలల వ్యవధిలో 10కి పైగా ప్రమాద ఘటనలు
- కంపచెట్లను తొలగించాలని గ్రామస్తుల వేడుకోలు

చిలుకూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆర్ అండ్‌బీ రోడ్డు మూల మలుపుల వద్ద కంపచెట్లు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయంపై ఆర్అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో మూలమలుపుల వద్ద సుమారుగా 10కు పైగా ప్రమాద ఘటనలు జరిగాయి. మూలమలుపుల వద్ద కంపచెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.


సీతారాంపురం నుంచి నారాయణపురం వెళ్లే రోడ్డులో మూలమలుపు వద్ద కమ్ముకున్న కంపచెట్లు


చిలుకూరు నుంచి దూదియాతండా వెళ్లే రోడ్డు


చిలుకూరు నుంచి ఆర్లెగూడెం వెళ్లే రోడ్డు


దూదియాతండా నుంచి జానకీనగర్ వెళ్లే రోడ్డు

సాహిత్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య

కోదాడఅర్బన్: సాహిత్య రంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోదాడ శాఖ గ్రంథాలయంలో సాహిత్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తెలంగాణ సాహిత్యానికి గుర్తింపు లేదని, సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ సాహిత్య అకాడమీని పునరుద్ధరించారని తెలిపారు. తొమ్మిదేళ్లలో కేసీఆర్ సర్కార్ ప్రవేశపెట్టిన సంక్షేమం, అభివృద్ధిని వేడుకల్లో భాగంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. గ్రంథాలయ చైర్మన్ ఎస్‌కె రహీం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు, భరతరావు, సుబ్బారావు, సత్యబాబు, మధు, కృష్ణయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌యాదవ్, గుండెల సూర్యం, కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు సృజనాత్మకతను పెంచుతాయి


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

కోదాడఅర్బన్: వ్యాసరచన పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయని కోదాడ ఆర్డీఓ లక్కినేని కిశోర్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కోదాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనాలు, కవితా పోటీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో విద్యార్థులు, కవులను భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ ఎస్‌కె రహీం, మున్సిపల్ కమిషనర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, సభ్యులు రాధాకృష్ణ, రాజశేఖర్, గరిడేపల్లి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలి

గరిడేపల్లి: మండలంలోని చాలా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉన్నందున వారి స్థానంలో విద్యా వలంటీర్లను నియమించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రణబోతు రవీందర్ కోరారు. ఆదివారం గరిడేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వెలిదండలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, గణితం, తెలుగు పండిట్, కీతవారిగూడెంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, గణితం, తెలుగు, గడ్డిపల్లిలో సాంఘికశాస్త్రం, తెలుగు పండిట్, కల్మలచెరువులో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, తెలుగు, పోనుగోడులో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సాంఘిక శాస్త్రం, గరిడేపల్లిలో సాంఘికశాస్త్రం, గణితశాస్త్రం, గానుగుబండలో తెలుగు పండిట్ వంటి తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు ఎలక సైదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్‌రావు, బాల సైదిరెడ్డి, రాంబాబు, వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి, సైదులు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఘనంగా పాలాభిషేకం, విగ్రహాల ఊరేగింపు


స్వామి వారి విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు

చిలుకూరు: చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన వీరాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం నూతన విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆదివారం స్వామి వారి విగ్రహాలకు పాలభిషేకం చేశారు. అనంతనం స్వామి వారి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపనకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కమిటీ సభ్యులు కోరారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- డీఎస్పీ అమరగాని కృష్ణయ్య


దేవాలయంలో పూజలు చేస్తున్న డీఎస్పీ కృష్ణయ్య

చిలుకూరు: కంఠమహేశ్వరస్వామి అనుగ్రహంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని డీఎస్పీ అమరగాని కృష్ణయ్య కోరారు. ఆదివారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని శ్రీకంఠ మహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌడ కులస్తులు గీత వృత్తితో పాటు ఇతర ఆదాయ మార్గాలను ఎంచుకోవాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, ఎంపీటీసీ వట్టికూటి ధనమూర్తి, కాసాని నాగేందర్, పండ్ల సోమయ్య, బత్తిని రాములు గౌడ్, బెల్లంకొండ వెంకన్న, పండ్ల గోపి, పండ్ల శ్రీను తదితరులున్నారు.

ముగిసిన కంఠమహేశ్వరస్వామి వార్షికోత్సవం


అల్లం ప్రభాకర్‌రెడ్డి, యరగాని నాగన్నగౌడ్‌లను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ముగిసింది. సుప్రభాతసేవ, గణపతి పూజ, ఆరాధన, పుణ్యాహవచనం జరిపించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాసాని గురవయ్యగౌడ్, ఎంపీటీసీ బాల్దూరి సందీప్, సుబ్బారావు, రామస్వామిగౌడ్, గోపాల్‌గౌడ్, కిరణ్‌గౌడ్, మట్టపల్లిగౌడ్, భిక్షంగౌడ్, నర్సింహారావు గౌడ్ నాగరాజు, గురవయ్య, సైదులు పాల్గొన్నారు.

పీవైఎల్ మహాసభలను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర నేత ధరావత్ రవి

గరిడేపల్లి: సూర్యాపేట పట్టణంలో ఈనెల 22న జరగనున్న ప్రగతిశీల యువజన సమాఖ్య (పీవైఎల్) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పీవైఎల్ రాష్ట్ర నేత ధరావత్ రవి కోరారు. ఆదివారం గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో జరిగిన పీవైఎల్ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువజన, విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈ పాలకులకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పీవైఎల్ జిల్లా మహాసభలో నిరుద్యోగ ఉద్యమ కార్యచరణపై పూర్తి స్థాయిలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి కామళ్ల సుందరయ్య, సహాయ కార్యదర్శి పొన్నం బ్రహ్మం, నరేష్, మురళికుమార్ తదితరులున్నారు.

ప్రతి గ్రామానికి అండగా నిలుస్తా


అన్నదానం ప్రారంభిస్తున్న రఘు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): నియోజకవర్గ ప్రజలు ఒక్క అవకాశం కల్పిస్తే రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా పరిపాలన చేసి చూపుతానని, ప్రతిగ్రామానికి అండగా నిలుస్తానని ఓజో ఫౌండేషన్ అధినేత పిల్లుట్ల రఘు అన్నారు. ఆదివారం చింతలపాలెం మండలం దొండపాడులో నిర్వహించిన జగన్నాథస్వామి ఆలయ వార్షికోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు రఘును సత్కరించారు. అన్నదానం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దొండపాడులో గంగమ్మ తల్లి జాతరకు, నాగమయ్య మందిరానికి, పీర్ల పండుగకు, చర్చిలకు ఆర్థిక సహకారం అందించామని, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం అందించడమే కాకుండా విద్యార్థుల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకన్న, శివారెడ్డి, ఆలయ కమిటి సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మఠంపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొమ్ము లింగయ్య ఇటీవల మృతి చెందాడు. సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి అందించిన రూ.5వేల నగదును ఆదివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పొట్ట వెంకన్న, ఆరాల నాగరాజు, కస్తాల మట్టయ్య, ఆరాల వీరాస్వామి, వస్కుల జయరాజు తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

నడిగూడెం: మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన మేరిగ వెంకులు (45) ఇటీవల వడదెబ్బకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన కాగితరామచంద్రాపురం సింగిల్‌విండో చైర్మన్ గోసుల రాజేష్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పేరెల్లి గోపయ్య తదితరులున్నారు.

అనుమతి లేని నిర్మాణాన్ని నిలిపివేయాలి

మునగాల: మండలంలోని నర్సింహాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల ద్వారకానగర్‌లోని వెంచర్‌లో అనుమతి లేకుండా జరిగే ఓ అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలని గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. ద్వారకానగర్ వెంచర్‌లో గతంలో గ్రామపంచాయతీకి కేటాయించిన స్థలాన్ని నేటివరకు వెంచర్ యజమాన్యం రిజిస్ట్రేషన్ చేయకుండా మిగిలిన స్థలంలో కొంతమేర ఓ ప్రైవేట్ వ్యక్తికి కట్టబెట్టేందుకు కొందరు వ్యక్తులు చేస్తున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలన్నారు. ఆ స్థలాన్ని ముందుగా గ్రామపంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయించి, పంచాయతీలో వివిధ అవసరాలకు ఉపయోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, ఖాళీ స్థలాన్ని గ్రామపంచాయతీకి చెందేలా చూడాలని కోరారు.

మంత్రి జగదీష్‌రెడ్డి గెలవాలని ఆకాంక్షిస్తూ..

- మోకాళ్లపై నడిచి ప్రత్యేక ప్రార్థనలు

భానుపురి : సూర్యాపేట నియోజకవర్గం నుంచి మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తూ సూర్యాపేట మైనార్టీ నాయకుడు పెద్దవంగు పూర్ణ శశికాంత్ తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఆదివారం తమిళనాడులోని నాగపట్నం వేలంగిని మేరీ మాత దేవాలయానికి కిలోమీటర్ దూరం మోకాళ్లపై నడిచి మొక్కులు చెల్లించుకున్నాడు. అనంతరం చర్చిలో తన సతీమణి, సూర్యాపేట మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ స్వరూప రాణితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆత్మీయ సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

మోతె: మండల పరిధిలోని ఉర్లుగొండ జెడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం 2001– 02 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు శ్రీనివాస్, బ్రహ్మయ్య, రమేష్, నాగయ్య, పూర్వ విద్యార్థులు యల్లయ్య, సత్యనారాయణ, వీరబాబు, శ్రీను, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, అప్పిరెడ్డి, పరుశరాములు, నాగచారి, సుకన్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతను పూడ్చాలి

నేరేడుచర్ల: కోదాడ– జడ్చర్ల ప్రధాన రహదారిపై డ్రెయినేజీ నిర్మాణానికి గుంత తీసి 15 రోజులు అవుతున్నా ఇంతవరకూ పూడ్చలేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం ఆయన గుంతను పరిశీలించారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, రామిశెట్టి నరేష్ తదితరులున్నారు.

ఆర్ఎంపీ మండల అధ్యక్షుడిగా శ్రీశైలం

మునగాల: మండల కేంద్రంలోని ది మునగాల పబ్లిక్‌స్కూల్ ఆవరణలో ఆదివారం ఆర్ఎంపీ మండల అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎరుకల శ్రీశైలంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా దాచేపల్లి మురళీకృష్ణ, కోశాధికారిగా పురుషోత్తం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొనుగొంటి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి వెంకన్నగౌడ్, నడిగూడెం, చిలుకూరు, అనంతగిరి, కోదాడ, మోతె మండలాల అధ్యక్షులు, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

గోపాలపురంలో తాగునీటికి కటకట

- సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- ఇంటి అవసరాలకు వాడుకునేందుకు కూడా ఇబ్బందులే..
- వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్న ప్రజలు


తాగునీరు రావడం లేదని నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని గోపాలపురం 1, 8, 9, 10వ వార్డుల్లో గత కొంతకాలంగా తాగునీటి సమస్య తలెత్తింది. బోరు, బావుల్లోని నీరు ఇంకిపోవడంతో కనీస అవసరాలు తీర్చుకోవడానికి నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజలు సమీపంలోని వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు, ధర్నా చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. తక్షణమే గ్రామ పంచాయతీ, సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు వచ్చేలా కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోర్లు ఎండిపోయాయి

గ్రామంలో ఉన్న బోర్లు ఎండిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. నీటి ఉధృతికి పైప్‌లైన్లు పగులుతున్నాయి. ఈ సమస్యపై మిషన్ భగీరథ అధికారులకు ఫిర్యాదు చేశాం. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– శాసనాల నాగసైదయ్య, సర్పంచ్, గోపాలపురం

బీసీలందరికీ రూ.లక్ష ఆర్థికసాయం అందించాలి

గరిడేపల్లి: దరఖాస్తు చేసుకున్న ప్రతి బీసీకి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ డిమాండ్ చేశారు. ఆదివారం గరిడేపల్లి మండలంలోని అబ్బిరెడ్డిగూడెంలో నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చే రూ.లక్ష ఆర్థికసాయానికి అనేక షరతులను పెట్టడం సరికాదన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు వెంకటరమణ, పద్మ, ఉప్పమ్మ, చాలమ్మ, గోపమ్మ, ఎల్లమ్మ, ఫాతీమా, వెంకటలక్ష్మి, మహేశ్వరీ, లక్ష్మి, లచ్చయ్య, సత్యం ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

హుజూర్‌నగర్: దివ్యాంగుల పింఛన్ పెంపును హర్షిస్తూ హుజూర్‌నగర్ పట్టణంలోని బీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపేందర్, హుస్సేన్, అరుణ, సైదులు, శ్రీను, గోపి, మల్లయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

కోదాడఅర్బన్: ప్రభుత్వ బడులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోదాడ మండల టీపీటీఎఫ్ అధ్యక్షుడు బడుగుల సైదులు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదుపాయాలు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తుందని తెలిపారు. పారిశుద్ధ్య కార్యక్రమాలకు స్కావెంజర్లు, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, స్కూల్ డ్రెస్సులు, పుస్తకాలు, పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్‌సీ ఏరియర్స్ మంజూరు చేయాలని పేర్కొన్నారు.

వాగులో గుర్రపు డెక్క తొలగింపు

నేరేడుచర్ల: మండలంలోని పెంచికల్‌దిన్న ఊర చెరువు అలుగు నుంచి వెళ్లే వాగులో ఆదివారం ఉపాధి హామీ కూలీలు గుర్రపు డెక్క తొలగించారు. గుర్రపుడెక్క పేరుకుపోవడంతో వాగులో నీరు ప్రవహించకుండా, వర్షాలు పడినప్పుడు పొలాల్లోకి చేరుతున్నాయని, దీనిని తొలగించడంతో నీరు సాఫీగా వెళ్తాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

పందిర్ల పండుగ


మఠంపల్లి గ్రామ కూడలిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మఠంపల్లి: మండల కేంద్రంలోని శుభవార్త చర్చి ఆధ్వర్యంలో ఆదివారం క్రైస్తవులు పందిర్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మఠంపల్లిలోని ప్రధాన కూడళ్లలో పందిర్లు ఏర్పాటు చేసి దివ్యప్రసాదంతో ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. పందిర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్లు మార్టిన్, రాజు, జోసెఫ్ తంబి, వీవీ హైస్కూల్ బ్రదర్ వినోద్‌రెడ్డి, సెయింటాన్స్ సిస్టర్లు రూబిన్, శౌరీలా, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి, చర్చి కమిటీ పెద్దలు గాదె జయభారత్‌రెడ్డి, బాల శౌరెడ్డి, బోయపాటి ఆంతోనిరెడ్డి, బాల్‌రెడ్డి, చిన్నపురెడ్డి, ఇన్నారెడ్డి, జార్జిరెడ్డి, థామస్‌రెడ్డి, రాయలు, సామేలు, కాకుమాను జోసెఫ్, శౌరి పాల్గొన్నారు.

జలబిందెల మహోత్సవం

పాత చిలుకూరులో సోమవారం జరగనున్న బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆదివారం జలబిందెల మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జల బిందెలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రామాలయ ఆవరణంలో సుప్రభాత సేవ, గోపూజ, యాగశాల ప్రవేశం, అగ్నిమథనం జరిపించారు. సోమవారం ఉదయం అన్నదానం, సాయంత్రం బోనాల కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ పూజారులు బుర్ర వాసుదేవాచార్యులు, సిరికొండ అనంతకృష్ణామాచార్యులు తెలిపారు.

– చిలుకూరు


జల బిందెల మహోత్సవంలో పాల్గొన్న మహిళలు